క్లుప్తంగా

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



కామారెడ్డి అర్బన్: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి, జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి అర్బన్: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసి నాటి వ్యవస్థాపకులను స్మరించుకున్నారు. జిల్లా కన్వీనర్ పి.శివప్రసాద్, నాయకులు సంపత్, ప్రశాంత్, రాజు, శ్రీకర్, గణేష్, హర్ష, బాలరాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ వద్ద మోటారుకు మరమ్మతులు



బాన్సువాడ : పట్టణానికి తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్ వద్ద మోటారు కాలిపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేశారు. ఫిల్టర్ బెడ్ వద్ద మూడు మోటర్ల ద్వారా పట్టణంలోని రక్షిత మంచినీటి ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తారు. మూడు మోటర్లలో ఒక మోటర్ కాలిపోవడంతో పట్టణంలోని కొన్ని కాలనీల్లో నీటి సమస్య ఉత్పన్నమైంది. దీంతో సిబ్బంది మోటారును బావిలోంచి బయటకి తీసి మరమ్మతులు చేశారు. తాగునీటిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



కామారెడ్డి అర్బన్: పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. కనీస వేతనాల పెంపులో సుప్రీం కోర్టు సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బాబాయ్, అరుణకుమార్, సిద్ధేశ్వరి, లలిత, సరోజ, అనిత తదితరులు పాల్గొన్నారు.

1న పీఆర్టీయూ మహాధర్నా



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహదినం మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు అల్లాపూర్ కుశాల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీఆర్టీయూ భవన్ వద్ద మహాధర్నా వాల్ పోస్టర్లను కుశాల్ జేఏసీ జిల్లా చైర్మన్ సరాల వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు.. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిందని, దీన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో టీజీఓ ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజీవాడి గ్రామశివారులోని మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేశాయి. సోమవారం రాత్రి కృష్ణాజీవాడి చెందిన కుమ్మరిరాజయ్య, కుమ్మరి చంద్రంకు సంబంధించిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంటలో అడవి పందులు దాడి చేసి, పంటను ధ్వంసం చేశాయి. ఈపంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం ఇప్పించాలని సదరు రైతులు కోరారు.

కలుపు మొక్కలతో కలవరం

- పత్తి చేలల్లో విపరీతంగా పెరిగిన గడ్డి
- కురుస్తున్న వర్షాలతో రైతులకు ఇబ్బందులు
- కూలీలకు పెరిగిన డిమాండ్



సదాశివనగర్ శివారులో సాగు చేసిన పత్తి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటల్లో కలుపు మొక్కలు పెరిగి రైతులను కలవరపెడుతున్నాయి. దీంతో ప్రధానంగా పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.పొలాల్లో నీరు నిలిచి ఉండడంతో పనులు కాస్త మందగించాయి. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 13వేల పై చిలుకు రైతులు ఉన్నారు. మండలంలో వరి 12వేల 150, మిక్కజొన్న 8వేల 435, కంది 970, సోయ 2420, పత్తి 3210 ఎకరాల్లో పంటలు సాగు చేశారు.

గుత్తా మాట్లాడుకుంటున్నారు..

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడ చూసిన పత్తి పంటనే ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. చేలల్లో పత్తితో పాటే గడ్డి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎడతెరపిలేకుండా కురుస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కూలీలకు వర్షం అడ్డంకిగా మారింది. కూలీలు కూడా పత్తిలో పాటు పెరిగిన గడ్డిని చూసి గుత్తా మాట్లాడుకుంటున్నారు. ఒక ఎకరానికి రూ. 5వేల నుంచి 8వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. రోజు కూలీ అయితే ఒక్క కూలీకి రోజుకు రూ. 300 నుంచి 400 వరకు అడుగుతున్నారు. దీంతో కొంత మంది రైతులు గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. మందు పిచికారీతో పంటకు కొంత నష్టం కలుగుతుందని భావించి మరి కొందరు ఖర్చుకు వెనుకాడకుండా కూలీలతో కలుపు తీయిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి పంట ఎదుగుతున్న క్రమంలో వేలల్లో పంటకు ఖర్చు పెడితే రానున్న రోజులు ఇంకెంత ఖర్చు భరించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేలల్లో డిమాండ్ చేస్తున్నారు



ప్రస్తుతం కురుస్తున్న వానలకు పత్తి చేలల్లో విపరీతంగా గడ్డి పెరిగింది. దీంతో కూలీల కోసం చాలా ఇబ్బంది అవుతుంది. కూలి ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో కూలీలతోనే గడ్డిని తొలగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గుత్తాగా మాట్లాడితే వేలల్లో డిమాండ్ చేస్తున్నారు. పంటల సాగు ఒక ఎత్తు అయితే, దాన్ని కాపాడుకోవడం మరో ఎత్తు అవుతోంది.

– ఎం.అశోక్‌రెడ్డి, రైతు, ధర్మారావ్‌పేట్

కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలి



భిక్కనూరులో మాట్లాడుతున్న డీపీఎం రాజయ్య

భిక్కనూరు : మహిళ సమాఖ్య ద్వారా వృద్ధ మహిళల కోసం కిశోర బాలికల కోసం నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని ఐకేపీ ఫైనాన్స్ డీపీఎం రాజయ్య అన్నారు. ఆయన మంగళవారం భిక్కనూరు మండల మహిళ సమాఖ్య గ్రామ అధ్యక్ష, కార్యదర్శుల, వీవోల సమావేశంలో పాల్గొని సోషల్ మొబైల్‌జేషన్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సాయిలు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మహిళ సమాఖ్య ద్వారా రుణాలను అందించడం జరుగుతుందన్నారు.

రాజంపేట/పెద్దకొడప్‌గల్/మద్నూర్ : పేద మహిళలను సంఘాలలో చేర్పించాలని మండల ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో సామాజిక చేకూర్పు నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, కిశోర బాలికల సంఘాలు ఏర్పాటుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్దకొడప్‌గల్ ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య మహిళ అధ్యక్షురాలు స్వరూప ఆధ్వర్యంలో వీవో ఏలకు, వీవో అధ్యక్షులతో కలిపి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం దూప్య మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మద్నూర్‌మండల ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘం అధ్యక్షులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఏపీఎం జగదీశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సాయిలు, మద్నూర్, భిక్కనూరు మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు రేణుక, రాజమణి, సీసీలు,వీవో ఏలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నస్రుల్లాబాద్ : మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన బాధితురాలు చంగీబాయికి మంజూరైన రూ.54,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం మాజీ సర్పంచ్ అంజయ్య అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి సహకారంతో చెక్కు మంజూరైందని ఆయన తెలిపారు. గ్రామస్తులు భాస్కర్,రవి, తదితరులున్నారు.

యువత లక్ష్యంతో పని చేయాలి

కామారెడ్డి అర్బన్: యువత లక్ష్యంతో పని చేయాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఎం. జైపాల్‌రెడ్డి అన్నారు. అంతర్జాయతీ యువజన దినోత్సవం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలలో 'స్థానిక యువత చర్యలు–స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, భవిష్యత్తు' అంశంపై విద్యార్థులకు ప్రేరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ పున్న రాజేష్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.అంజయ్య, రోటరీ అధ్యక్షుడు యాచం శంకర్, కార్యదర్శి ఎస్.కృష్ణహరి, ప్రతినిధులు సుధాకర్, తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు హర్షణీయం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రం శివారులో విద్యుత్ అధికారులు మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో లేక రైతులు ఇబ్బందులు పడ్డారు.ఈవిషయాన్ని రైతులు ట్రాన్స్ కో ఏఈ గంగాధర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈని రైతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ విండో చైర్మన్ లింగారెడ్డి, కోతి లింగారెడ్డి, విఠల్ రెడ్డి, బాల్ రెడ్డి, నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

ఆలయం భూమికి హద్దుల ఏర్పాటు



రామారెడ్డి : మండలంలోని రంగంపేటలో విఠలేశ్వర స్వామి దేవాలయం, శివాలయం భూమికి మంగళవారం రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు రోజుల క్రితం కలెక్టర్ పర్యటించినప్పుడు దేవాలయ భూమికి హద్దులు చూపించాలని గ్రామస్తులు కోరారు. ఆలయ భూమిని కొలిచి 4.21 ఎకరాలకు అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికాంత్, వీడీసీ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు మగ్గిడి శ్యామ్, వీడీసీ సభ్యులు సురేందర్ సింగ్, పిట్లల అశోక్, సంజయ్ సింగ్, ఎంకంపల్లి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయంలో జలాభిషేకం



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమార్‌పేట్‌లో గ్రామస్తులు మంగళవారం హనుమాన్ ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. గ్రామ శివారులోని చెరువు నీటిని బిందెలతో శోభాయాత్ర నిర్వహించిన అనంతరం హనుమంతుడికి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, అందరు సుఖ సంతోషాలతో ఉండాలని వారు దేవుడిని వేడుకున్నారు.

సలాబత్‌పూర్‌కు భక్తుల పాదయాత్ర



మద్నూర్(జుక్కల్): మండలంలోని సోమూర్ నుంచి మద్నూర్ మీదుగా సలాబత్‌పూర్ హనుమాన్, శివాలయం వరకు మంగళవారం భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తులు భజనలు చేస్తు పాటలు పాడుతు భక్తితో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర చేస్తున్న వారికి మద్నూర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శ్రావణ మాసం సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు సలాబత్‌పూర్‌కు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శివలింగాలకు అభిషేకాలు చేశారు.భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు.

విద్యుత్ సదస్సులో ఫిర్యాదుల పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ నారాయణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మంగళవారం నిర్వహించిన ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట విద్యుత్ వినియోగదారుల సదస్సులో 8 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించినట్లు ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో ఏడీఏ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వీకేవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సదస్సుకు జిల్లా కన్స్యూమర్ గ్రీవియెన్స్ రిడ్రెసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ నారాయణ, టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజాగౌడ్, ఏడీఈ, ఏఈలు వెంకటస్వామి, నాగరాజు రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు. విద్యుత్‌లో ఓల్టేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అధిక బిల్లులు తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని రెండో వార్డులో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. కాలనీలో లోఓల్టేజీ కారణంగా ఇబ్బందులు ఉన్నాయని దీనిని దృష్టిలో ఉంచుకుని కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వారు ఏఈ వెంకటస్వామికి విన్నవించారు. కాలనీ వాసులు మహేష్, నరేష్, ప్రవీణ్, ప్రకాష్ తదితరులున్నారు.

ప్రాథమిక విద్య అత్యంత కీలకమైనది



లింగంపేటలో మాట్లాడుతున్న ఎంఈవో షౌకత్‌అలీ



మాచారెడ్డిలో మాట్లాడుతున్న ఎంఈవో దేవేందర్‌రావు

మాచారెడ్డి/నాగిరెడ్డిపేట/లింగంపేట/రాజంపేట/భిక్కనూరు : ప్రాథమిక విద్య ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైనదని మాచారెడ్డి విద్యాధికారి దేవేందర్ రావు అన్నారు. మంగళవారం విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఎన్ఈపీ 2020 ప్రకారం సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట హైస్కూల్‌లో గ్రామ పంచాయతీవారీగా ఒక ఉపాధ్యాయునితోపాటు గ్రామసమన్వయకర్తకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆర్పీలు జయరాంరెడ్డి, కిష్టయ్య నిర్వహించారు. వయోజన విద్యా కార్యక్రమాన్ని ప్రతి వలంటీర్ విజయవంతం చేయాలని మండల విద్యాధికారి పూర్ణచందర్‌రావు తెలిపారు. రాజంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భిక్కనూరులో ఉపాధ్యాయులకు, బుక్‌కీపర్సులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారెడ్డి మాట్లాడారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన(అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ)'' ఉల్లాస్'' శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాధికారి షౌకత్‌అలీ మాట్లాడారు. జిల్లాలో 56,472 మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి 1549 మంది వలంటీర్లను నియమిస్తున్నట్లు షౌకత్ అలీ పేర్కొన్నారు. వివిధ కారణాలతో 15 సంవత్సరాల పైబడిన చదువుకొని వయోజనులు ఉల్లాస కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు కీలకమైన జీవన నైపుణ్యాలను నేర్చుకుంటారని ఎంఈవోలు అన్నారు. పాఠశాల కళాశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు వెంకటాచారి, యేసు రత్నం, సురేందర్, గోపాల్‌పేటహైస్కూల్ హెచ్ఎం వెంకట్రాంరెడ్డి, రాజంపేట కాంప్లెక్స్ హెచ్ఎం ఈశ్వరయ్య, ముదాం స్వామి, డీఆర్పీలు మహిపాల్, రాములు, సీఆర్పీలు సంజీవ్, నరేష్, వీవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు..

లంబాడా హక్కుల క్రమశిక్షణ కమిటీ జిల్లా కన్వీనర్‌గా నౌసిలాల్



కామారెడ్డి అర్బన్: లంబాడా హక్కుల పోరాట సమితి క్రమశిక్షణ కమిటీ జిల్లా కన్వీనర్‌గా మాలోత్ నౌసిలాల్ నాయక్ నియమితులయ్యారు. జాతీయ వ్యవస్థాపకులు బెల్లయ్యనాయక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు గణేష్‌నాయక్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాణప్రతాప్ రాథోడ్ ఆయనకు నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బద్రినాయక్, గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల యూత్ కమిటీ ఎన్నిక



పిట్లం(జుక్కల్): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం యూత్ మండల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పిట్లం మండల ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం యూత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. రాజుదాస్, ఉపాధ్యాక్షుడిగా డి. నరేష్, సెక్రెటరీగా ఎం. సురేష్, ఆర్గనైజర్లుగా ఎం.ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నీలం నర్సింలు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కామారెడ్డికి చెందిన నీలం నర్సింలు పటేల్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తంరావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్యలకు నీలం నర్సింలు ధన్యవాదాలు తెలిపారు. మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడిగా గంగారాం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల అంబేడ్కర్ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం కామారెడ్డి అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. లింగంపేట మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా నెల్లూరి గంగారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తల గంగారాం మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గైని రాజు, ఉపాధ్యక్షుడు అట్కరి బబ్లూ, ముదాం సాయిలు, సంగమేశ్వర్, భూపతి, విఠల్, ప్రవీణ్, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక



నినాదాలు చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పెద్దకొడప్‌గల్ : మండల భారతీయ కిసాన్ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కామారెడ్డి జిల్లా భారతీయ కిసాన్ సంఘం అధ్యక్షులు విఠల్ రెడ్డి తెలిపారు.మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. భారతీయ కిసాన్ సంఘం మండల అధ్యక్షుడిగా బస్వారాజ్ దేశాయ్, ఉపాధ్యక్షుడిగా జైత్రం, గిరాప్ప, కార్యదర్శిగా బోడి రాజు, సహాయ కార్యదర్శిగా బోడి మల్లికార్జున్, రంజిత్, సభ్యులుగా గురుదాస్, గోపాల్ సింగ్, బైపాల్, జుక్కల అంజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా భారతీ కిసాన్ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్,బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కిషన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాణాపూర్ తండాలో..

లింగంపేట : మండలంలోని బాణాపూర్ తండాలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీని మంగళవారం నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వసురాం, ఉపాధ్యక్షులు దేవిసింగ్, హేమ్లా, ప్రధాన కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి రమేశ్, కోశాధికారి జవహర్‌లాల్, ఆదర్శ రైతు సరిచంద్, కార్యవర్గ సభ్యులు మోహన్‌సింగ్, సూర్య, రమేశ్, పరుశురాం, రవి, శంకర్‌నాయక్, పీర్‌సింగ్, హరిసింగ్, జైరాం, సరిచంద్, బంతిలాల్, సావాయినాయక్, మంగ్యానాయక్, శ్రీనివాస్, పీర్‌సింగ్, హరిచంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



రాజంపేట: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన రాజంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్దిదారులకు మంగళవారం చెక్కులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్దాపూర్ 1, గుండారం 3, ఎల్లారెడ్డిపల్లి 3, కొండాపూర్ 4, ఆర్గోండ 5 చెక్కులను ఇంటికి వెళ్లి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా నాయకులు వినోద్ కుమార్, మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల బీసీసెల్ నాయకులు బీరయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిద్దిరాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శామయ్య, యాదగిరి, ఆర్‌ఐ లక్ష్మణ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. తాడ్వాయిలో మంగళవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వారు పంపిణీ చేశారు. నాయకులు మహేందర్‌రెడ్డి, గైనిశివాజీ, శ్యాంరావు, మేకలరాజు, రాజేందర్, అబ్దుల్‌ఘని, నారాయణరెడ్డి, అనిల్, గ్రామ కార్యదర్శి బాలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పాకిస్తాన్ ఉగ్రవాద దేశం'

కామారెడ్డి అర్బన్: పాకిస్తాన్ ఉగ్రవాద దేశమని మరోసారి రుజువైందని విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు కోత్మిర్‌కర్ వినయ్‌కుమార్ అన్నారు. అమెరికా నుంచి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్‌మునీర్ అణుబాంబు బెదిరింపు వాఖ్యలు ప్రపంచ దేశాలు అర్థం చేసుకోవాలన్నారు. నాయకులు రాహుల్, వేణు, దినేష్, ఓంప్రసాద్, జైరాం, శ్రీకాంత్, రమేష్, మధు, గోపాల్, నవీన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ఉపాధ్యాయులు వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలోని ఇంగ్లీష్ మిడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులో సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరుకావాలన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు

మాచారెడ్డి: హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపవద్దని కమ్యూనిటీ లింక్ వర్కర్ బాలకిషన్ సూచించారు. మంగళవారం పాల్వంచ మండలం భవానీపేటలో వైఆర్జీకేర్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎం సూర్యప్రకాశ్‌గౌడ్, ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని 2వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభమైనట్లు కాంగ్రెస్ నాయకులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, కాలనీ వాసులు కిష్టయ్య, కృష్ణమూర్తి తదితరులున్నారు.

భవిత కేంద్రం భవన నిర్మాణానికి భూమి పూజ



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రత్యేకావసరాలు గల చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రం స్థానిక ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతుంది. భవిత కేంద్రం నూతన భవన నిర్మాణానికి మంగళవారం ఎంఈవో శ్రీహరి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రం భవనం కోసం రూ. 11 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఆంజనేయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.